రైతులకు అన్యాయం జరగనివ్వం

- సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు అండగా ఉంటాం
- పరిహారం విషయంలో జాప్యం చేస్తే ఊరుకోం
- పిన్నాపురం రైతులకు కాటసాని భరోసా



పిన్నాపురం రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు అన్యాయం జరగనివ్వబోమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యంలోని పార్టీ కార్యాలయం వద్ద పిన్నాపురం రైతులు, పాణ్యం ప్రజలతో మాట్లాడారు. పిన్నాపురం భూముల విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. రైతులు పొలాలను త్యాగం చేస్తే ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు రైతులకు సకాలంలో పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తే సహించమన్నారు. రైతుల తరుపున నిలబడి వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 212లో సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం, కంపెనీ ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. ఈ విషయంపై ఇప్పటికే కంపెనీకి అల్టిమేటం ఇచ్చామన్నారు. వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వకుంటే కంపెనీ వద్దకు వెళ్లి తేల్చుకుంటామని తెలిపారు. ఈ విషయమై ఇదివరకే కలెక్టర్‌తో మాట్లాడామని, లిఖిత పూర్వకంగా తెలియజేశామని చెప్పారు. అయినా జాప్యం జరగడం సరికాదన్నారు. ప్రతి రైతులకు న్యాయం చేయాల్సిందేన్నారు. అధికారులు తీరుమార్చుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు.

పరిహారం ఇచ్చి పనులు చేసుకోండి

పిన్నాపురం రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులకు ఫోన్‌లో సూచించారు. పరిహారం ఇవ్వకుండా రైతులను వేధిస్తే రైతులతో కలిసి గ్రామానికి రావాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే పరిహారం అందిస్తామని కంపెనీ ప్రతినిధులు సమాధానం ఇచ్చారు. ఆయనతో పాటు బాబు, సునీల్, రమణ, రామచంద్రుడు, టైలర్‌బాషా, ఎల్లగౌడ్, చిన్న సుబ్బయ్య, శేషారెడ్డి, పెద్దస్వామి, సత్యాలు, కిట్టు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి విశేష పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మహామంగళహారతులు ఇచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎంపీడీఓ దాడి ఘటనపై ఆందోళన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు

ఓర్వకల్లు: అన్నమయ్య జిల్లా గాలివీడులో ఎంపీడీఓపై జరిగిన దాడి అమానుషమని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. దాడికి నిరసనగా శనివారం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఎంపీడీఓపై దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులంతా ఆయా గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జ్ అయ్యస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘంలోని ఖాతాదారులంతా ఈకేవైసీ చేయించుకుంటేనే సంఘంలో ఓటు హక్కు ఉండడంతో పాటు, ప్రభుత్వం నుంచి రాయితీలు, సున్నా వడ్డీ రుణాలు, పంటల కొనుగోలు, ఎరువులు లభిస్తాయన్నారు. ఖాతాదారులంతా గ్రామ సచివాలయాల్లోని సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోడుమూరు రూరల్: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 30న జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులతో పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

ఎస్సీ కులగణన సర్వే పూర్తి చేయాలి

ఓర్వకల్లు: ఎస్సీ కులగణన సర్వే ద్వారా గుర్తించిన జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారు జాబితాలో మార్పులు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను జనవరి 1వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ ద్వారా పరిశీలించి జనవరి 10వ తేదీలోగా తుది జాబితా ప్రదర్శిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న అమ్మవారు

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠను శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారంలోనే ఆలయ నిర్మాణం చేపట్టి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వేద పండితులు సుబ్బుశాస్త్రి, కృష్ణయ్యశాస్త్రి, కృపాకర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ఎస్సీ కులగణన సర్వే జాబితా ప్రదర్శన

కల్లూరు: గ్రామ సచివాయాల నోటీస్ బోర్డులో ఎస్సీ కులగణన సర్వే జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత గ్రామ సచివాలయంలో వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ నెల 31లోపు తెలియజేయాలని పేర్కొన్నారు.

'పరీక్షా పే చర్చా'కు నమోదు చేసుకోండి

- డీఈఓ శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: పరీక్షా పే చర్చాకు నమోదు చేసుకోవాలని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పరీక్షా పే చర్చా నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానితో భేటి కావాలనుకునే వారు ఈ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశం కేవలం విద్యార్థులు, టీచర్లకు మాత్రమే కలదన్నారు. జనవరిలో నిర్వహించే 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్నారు. పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో సమావేశమై.. వారికి సలహాలు, సూచనలు, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారన్నారు. జనవరి 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఓంకార్ యాదవ్, హెచ్ఎం ప్రాణేషకుమార్ తదితరులు ఉన్నారు.

గోకులాల నిర్మాణం వేగవంతం కావాలి



వర్కూరులో నిర్మిస్తున్న గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: మండలంలో ఉపాధిహామీ పథకం కింద పాడిరైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శనివారం మండలంలోని వర్కూరులో పాడి రైతు నిర్మించుకుంటున్న గోకులం షెడ్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. మండలంలోని పులకుర్తి-3, కల్లపరి, ప్యాలకుర్తి, వర్కూరులో ఒక్కొక్కటి చొప్పున గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. 6 పశువులకు గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు ఖర్చవుతుందని, ఇందులో లబ్ధిదారుడి వాటా రూ.16వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు పులకుర్తి-2, కల్లపరిలో ఒక గోకులం నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని ఏపీఓ పేర్కొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం

- తమకు చెప్పకుండా అభివృద్ధి పనులు చేయడంపై కౌన్సిలర్ల ఆగ్రహం



గూడూరు నగర పంచాయతీ ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్మన్, కమిషనర్

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ నాగరాజు నిర్వహించిన నగర పంచాయతీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం రసాభాసాగా మారింది. తమకు సమాచారమివ్వకుండానే తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చెపడుతున్నారంటూ కౌన్సిలర్లు అధికారుల తీరును ఎండగట్టారు. నగర పంచాయతీలో నిధులున్నా పట్టణాన్ని ఎందుకు అభివృద్ధి చేయడం లేదంటూ కౌన్సిలర్లు అధికారులపై మండిపడ్డారు. సమావేశంలో అందజేసే అజెండా పత్రాలను ముందుగానే కౌన్సిలర్లకు అందజేయాలని డిమాండ్ చేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వెంచర్లు వేసి వ్యాపారాలు చేస్తుంటే నగర పంచాయతీ అధికారులు ఏమి చేస్తున్నారని, వెంటనే అక్రమ లేఅవుట్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నిలదీశారు. చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నగర పంచాయతీ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సభ దృష్టికి కౌన్సిలర్లు తెచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పీఎన్ అస్లాం, లక్ష్మన్న, కోఆప్షన్ సభ్యులు రామాంజినేయులు, కౌన్సిలర్లు సురేష్, దస్తగిరి, ఖలీల్, రత్నమ్మ, కిశోర్, బజారి, మద్ది, షేషావలి, విజయుడు, మదార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ అఖిల

పాణ్యం: మత్తుపదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని.. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని నంద్యాల ఎక్సైజ్ ఎస్ఐ అఖిల అన్నారు. శనివారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి కళాశాలలో చేరగానే లక్ష్యాలు కూడా ముందుంటాయన్నారు. వాటిని ఏ మాత్రం మరిచినా జీవితాలు తలకిందులవుతాయన్నారు. చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికి విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వ హెల్ప్‌డెస్క్ నంబర్లు 122, 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, సునీతా, శ్యామ్ బాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



ఎంపీడీఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

ఓర్వకల్లు: సమాజంలో నిరాధరణకు గురైన విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడం మన ధర్మమని డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. ఈ నెల 3వ తేదీ జరగాల్సిన జాతీయ వికలాంగుల దినోత్సవం అనివార్య కారణాల వల్ల నిర్వహించలేకపోవడంతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. దివ్యాంగులను చిన్నచూపు చూడడం నేరమన్నారు. ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకులు నాగన్న, మథర్ థెరీసా డెవెలప్‌మెంట్ కోఆర్డినేటర్ మణి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ సామాజికవర్గ జాబితా ప్రదర్శించామని.. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అన్ని సచివాలయాల్లో ఎస్సీ జాబితాను నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే వినతుల రూపంలో వీఆర్వోకు తెలపాలని సూచించారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్ కుమార్

కర్నూలు(రూరల్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చడానికి సరిపడా నీటి నిల్వలు, గార్గేయపురం గ్రామ సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి కిడారి సందీప్ కుమార్ శనివారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి కర్నూలు, ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాల పరిధిలో 15 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రఘునాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏఈ రంగస్వామి, మురళి, గార్గేయపురం పంచాయతీ అధికారి పురుషోత్తం, వీఆర్వో నాయుడు తదితరులు ఉన్నారు.

సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలి

ఓర్వకల్లు: కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ అన్నారు. గ్రామీణ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోందని వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం మండలంలోని కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కాల్వబుగ్గ స్కీమ్ నుంచి ఏయే గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది? ప్రజలు ఆ నీటిని సక్రమంగా వినియోగించుకుంటున్నారా? అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాల్వబుగ్గ స్కీమ్ నుంచి కాల్వబుగ్గ, కాల్వ, సోమయాజుపల్లె, హుసేనాపురం, ఓర్వకల్లు, తిప్పాయపల్లె, ఎన్ కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు సరఫరా చేయడం జరుగుతుందని, రెండు గ్రామాలకు పైపులైన్ సక్రమంగా పనిచేస్తున్నాయని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వీటి నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్డీఓ సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఇంజినీర్లు శ్రీనివాసులు, లోకేశ్వరి ఉన్నారు.

కాల్వబుగ్గ ఆలయ అభివృద్ధికి కృషి



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కాల్వబుగ్గ దేవస్థానం రూపొందించిన నూతన క్యాలెండర్లను టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, గోవిందరెడ్డి, ఆలయ ఈఓ మద్దిలేటితో కలిసి ఆవిష్కరించారు. ముందుగా బుగ్గరామేశ్వర స్వామిని దర్శించుకుని, అభిషేకార్చనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా విభజన తర్వాత ప్రధాన శైవక్షేత్రాలన్ని నంద్యాల జిల్లాకు పోవడంతో కర్నూలుకు కేవలం కాల్వబుగ్గ మాత్రమే మిగిలిందన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే క్షేత్రంలో 25 గదులకు ప్రతిపాదనలు పంపామన్నారు. పాలకొలను సుధాకర్‌రెడ్డి, చంద్ర పెద్దస్వామి, మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, రాంభూపాల్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

మూలపెద్దమ్మ ఆలయంలో వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు శనివారం బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ రామలింగారెడ్డి తెలిపారు. ఏడాది పాటు టెంకాయలు, పూలు, పూల దండలు, పూజా సామగ్రి విక్రయించుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నాయుడు అందిరి కంటే హెచ్చుగా రూ.42 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారద

కల్లూరు: గ్రామాల్లో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ శారద అన్నారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల జనరల్ ఫండ్ గురించి, జనవరి 3న జరగనున్న మండల సర్వసభ్య సమావేశం గురించి ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మునిస్వామి, సామన్న, సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. కాగా అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

వెండిపడగ బహూకరణ



వెండి పడగను అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామికి దాతలు వెండి పడగను కానుకగా సమర్పించినట్లు ఈఓ రామక్రిష్ణ శనివారం తెలిపారు. బనగానపల్లె మండలానికి చెందిన మేడం వెంకటసుబ్బమ్మ కుమారుడు సురేంద్రశెట్టి, సుప్రదీప్తి, రాఘవేంద్ర, శ్వేత, రాజేష్, రమ్య కుటుంబ సభ్యులు 3.90 కేజీల వెండి పడగను అందజేసినట్లు చెప్పారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

పాణ్యం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. శనివారం నెరవాడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గౌరు చరితా, ఆర్డీఓ విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి వాటికి పరిష్కారం చూపేంత వరకు ఆయా గ్రామీణ అధికారులు పర్యవేక్షణ చేస్తుంటారన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 58 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మండల డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని బసవాపురం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూసమస్యలపై రైతుల నుంచి 14 అర్జీలు అందినట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గిడ్డయ్య, మండల సర్వేయర్ సుధాకర్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- విజృంభిస్తున్న దోమలు



చిన్నటేకూరులో డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారం



బస్తిపాడులోని ఓ వీధిలో చెత్త

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కల్లూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలు, నాలుగు మజార గ్రామాలతో కలిపి మొత్తం 24 గ్రామాలు ఉన్నాయి. వీధులు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెద్దారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువలు, రోడ్లు మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారాయి. కొన్ని గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్తచెదారంతో నిండిపోయి పూడికతో ఉన్నాయి. కాలువల్లో మురుగు నీరు ముందుకు పారడం లేదు. నిల్వ చేరి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు, ల్యార్వాలు ప్రబలుతున్నాయి. గత కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.